క్లుప్తంగా

మదనగోపాలుని ఆలయానికి ధమరుకం సమర్పణ



మదన గోపాల స్వామి ఆలయానికి ధమరుకం సమర్పణ

కొయ్యలగూడెం : స్థానిక శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత శ్రీ మదన గోపాల స్వామి ఆలయానికి రూ.29 వేల విలువైన ధమరుకాన్నీ దాతలు శనివారం బహూకరించారు. ఛాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు మాటూరి నాగ వెంకట పంచాక్షరి, సుధీర్, నాగ పంచాక్షరి సోదరులు వారి తల్లిదండ్రుల పేరిట ఈ ధమరుకాన్ని అందజేశారు. కాగా ఈనెల 27 నుంచి మార్చి 6వ తేదీ వరకు దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్టాపన ఆలయ ప్రారంభోత్సవ, యాగశాల పూజలు కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

పారిజాతగిరిలో ప్రత్యేక పూజలు



విశేషాలంకరణలో వెంకటేశ్వరస్వామి

జంగారెడ్డిగూడెం : స్థానిక గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీవెంకటేశ్వరస్వామి వారి ఆలయంలో శనివారం స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు. వివిధ రకాల పువ్వులు, తులసీమాలలతో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి అర్చకులు నల్లూరి రవికుమారాచార్యులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సుప్రభాత సేవ మొదలుకుని ఆరాధన, తోమాల సేవ, తీర్థప్రసాదగోష్టి, అష్టోత్తర పూజలు చేశారు. భక్తులు మొక్కుబడులు తీర్చుకున్నారు. కొయ్యలగూడెంకు చెందిన గేలం శ్రీకాంత్, లలితాంజలి, లక్ష్య కృష్ణశ్రీ తదితరులు అన్నప్రసాద వితరణ చేసినట్లు ఈవో మానికల రాంబాబు తెలిపారు. కార్యక్రమంలో అభివృద్ధి సభ్యులు దండు దనరాజు, రెడ్డి రంగప్రసాద్, అబ్బిన దత్తాత్రేయ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు రక్త పరీక్షలు



దొరమామిడిలో గర్భిణులకు రక్త పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం : గర్భిణులు తమ ఆరోగ్యం పట్ల కచ్చితమైన జాగ్రత్తలు పాటించాలని జంగారెడ్డిగూడెం డివిజనల్ ఆరోగ్యశాఖ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఐ.రాజీవ్ అన్నారు. దొరమామిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ పరిధిలోని గర్భిణులకు రక్త పరీక్షలు చేశారు. అలాగే హిమోగ్లోబిన్ శాతాన్ని తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గర్భిణుల్లో రక్తహీనత లోపం చాలా ప్రమాదకరమని అన్నారు. గర్భిణుల్లో రక్తహీనత లేకుండా తప్పనిసరిగా ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలను క్రమం తప్పకుండా వాడాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు ఏవీఎస్ రవి, ఎస్.నందిని, ఆరోగ్య విస్తీర్ణ అధికారి ఎల్.సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

రికార్డులు సక్రమంగా నిర్వహించాలి



సచివాలయంలో సిబ్బంది నుంచి వివరాలు అడిగి తెలుసుకుంటున్న డీఎల్‌డీఓ రాజు

బుట్టాయగూడెం : సచివాలయ సిబ్బంది అందుబాటులో ఉండి ప్రజలకు సేవలందించేందుకు కృషి చేయాలని డీఎల్‌డీఓ ఎం.రాజు అన్నారు. మండలంలోని కోటనాగవరం సచివాలయాన్ని శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు సంబంధించిన రికార్డులు సమగ్రంగా నిర్వహించాలన్నారు. అలాగే మార్చి 1వ తేదీన వృద్ధులకు, వికలాంగులకు అందించే పింఛన్లు సకాలంలో అందేలా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, పాల్గొన్నారు.

యాజమాన్యానిదే పూర్తి బాధ్యత

ఏలూరు (టూటౌన్): చింతలపూడి మండలం వెలగలపల్లి కేఎంఆర్ మొక్కజొన్న ఫ్యాక్టరీలో జరిగిన ప్రమాదానికి యాజమాన్యమే పూర్తి బాధ్యత వహించి గాయపడ్డ గణిజెర్ల గ్రామానికి చెందిన జొన్నలగడ్డ మరియమ్మకు వైద్య చికిత్స అందించాలని, ఆస్పత్రి ఖర్చులు, నష్ట పరిహారం చెల్లించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్‌వీఎస్ నారాయణ, చింతలపూడి మండల అధ్యక్షుడు నత్తా వెంకటేశ్వరరావులు శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఫ్యాక్టరీలో మహిళలకు కావాల్సిన సదుపాయాలన్నీ కల్పించాలని, అంబులెన్స్ ఏర్పాటుచేయాలని పేర్కొన్నారు.

మెట్టలో ముమ్మరంగా రబీ సాగు

సబ్ డివిజన్‌లో 8,486 ఎకరాల్లో రబీ సాగుకు సన్నాహాలు



మెట్టలో రబీ సాగుకోసం దుక్కులు దున్నుకుంటున్న రైతులు




మెట్టలో రబీ నారుమళ్లు పోసిన దశ్యం

చింతలపూడి : ఖరీఫ్ వ్యవసాయం ముగిసింది, మెట్ట రైతాంగమంతా ఇప్పుడు రబీ సాగులో ముమ్మరంగా నిమగ్నమై ఉన్నారు. ఈ ఏడాది వర్షాలు ఆశించిన విధంగా కురవడంతో పాటు అడపా, దడపా తుపానుల ప్రభావంతో కురిసిన వర్షాలకు చెరువుల్లో నీళ్లు పుష్కలంగా ఉన్నాయి. ఈ ఏడాది భూగర్భ జలాలు పుష్కలంగా అందుబాటులో ఉండటంతో రబీ పంట ద్వారా దిగుబడులు సాధించవచ్చునని రైతులు ఆశపడుతున్నారు. చింతలపూడి సబ్ డివిజన్‌లో 8,486 ఎకరాల్లో రబీ వరి సాగు, 30,769 ఎకరాల్లో మొక్కజొన్న, 2,336 ఎకరాల్లో పొగాకు, 799 ఎకరాల్లో చెరకు, 381 ఎకరాల్లో పొద్దు తిరుగుడు, 510 ఎకరాల్లో వేరుశనగ, 255 ఎకరాల్లో మిర్చి పంటలు పండించడానికి లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటి వరకు 80 శాతానికి పైగా వరి నాట్లు పూర్తయ్యాయని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. వాతావరణం కూడా అనుకూలంగా ఉండటంతో రైతులు మరింత ఉత్సాహంగా రబీకి సన్నద్ధమవుతున్నారు.

కలుపు నివారణతో అధిక దిగుబడులు

ఈ దశలో మొక్కజొన్నలో కలుపు నివారణ చర్యలు చేపడితే అధిక దిగుబడులు సాధించవచ్చునని వ్యవసాయాధికారులు తెలిపారు. కలుపు నివారణకు యట్రజిన్ మందును ఎకరానికి కేజీన్నర చొప్పున నీటిలో కలిపి పిచికారి చేయాలని సూచించారు. అలాగే ప్రస్తుతం వరిలో జింక్ లోపం తలెత్తే అవకాశం ఉందన్నారు. రైతులు వ్యవసాయాధికారులను సంప్రదిస్తే జింక్ అందిస్తామని చెప్పారు.

ఆరుతడి పంటలకు ప్రాధాన్యం ఇవ్వాలి



భూగర్భ జలాలు ఈ ఏడాది పెరిగాయి. నీటిని ఆదా చేసుకుని మెట్టలో రైతులు ఆరుతడి పంటలు వేసుకోవడం మేలు. మార్చి నెల వచ్చే సరికి చెరువుల్లో నీళ్ల తగ్గిపోయి సాగు నీటి ఎద్దడి తలెత్తే ప్రమాదం ఉంది. తాగునీటితోపాటు పశువులకు కూడా నీరు దొరక్క ఇబ్బందులు కలుగుతాయి. ఈ పరిస్థితుల్లో ఆరుతడి పంటలు వేసుకోవడం వల్ల నష్టం ఉండదు. రైతులు వరికి బదులు మొక్కజొన్న, వేరుశనగతో పాటు అపరాల వంటి పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలి.

–బి.నాగకుమార్, ఏడీఏ, చింతలపూడి సబ్ డివిజన్

నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి కృషి

బుట్టాయగూడెం : నిర్వాసితుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామని పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. శనివారం సాయంత్రం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఇటీవల విలీన మండలాల్లో ఆర్‌అండ్‌ఆర్‌కు సంబంధించి ఇంటి విలువ తగ్గిస్తున్నారంటూ నిర్వాసితులు ఆందోళన చెందుతున్నట్లు తన దృష్టికి వచ్చిందని అన్నారు. సంబంధిత అధికారులతో మాట్లాడి కచ్చితమైన ఇంటి విలువ ఉండే విధంగా కృషి చేస్తున్నామని చెప్పారు. ఇప్పటికే అధికారులకు ఆ దిశగా ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. నిర్వాసితులు ఆందోళన చెందవద్దని అన్నారు. అదేవిధంగా వేసవికాలం దృష్ట్యా వేసవిలో మంచినీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకునేలా అధికారులను అప్రమత్తం చేసినట్లు చెప్పారు. ప్రస్తుతం వాతావరణంలో మార్పుల దృష్ట్యా గిరిజన గ్రామాల్లో ఎటువంటి అనారోగ్య సమస్యలు తలెత్తకుండా వైద్యాధికారులను కూడా అప్రమత్తం చేశామన్నారు. అలాగే మార్చి 1వ తేదీన అర్హులకు అందజేసే పింఛను పంపిణీ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్‌లు, సచివాలయ కన్వీనర్‌లు, గృహసారథులు కూడా పాల్గొనాలని కోరారు.

విద్యార్థిపై దాడి.. దుర్మార్గపు చర్య

జంగారెడ్డిగూడెం : పట్టణంలో ప్రైవేట్ పాఠశాలలో 8వ తరగతి చదువుకుంటున్న ధర్మవరపు సంజయ్‌ను శుక్రవారం ఇంటిదగ్గర ఎవరూ లేని సమయంలో గుర్తు తెలియని వ్యక్తి బ్లేడ్‌తో గాయపర్చడం దుర్మార్గపు చర్య అని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(పీడీఎస్‌యూ) రాష్ట్ర అధ్యక్షుడు ఈ.భూషణం శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణంలో రోజురోజుకు దాడులు, దొంగతనాలు, హత్యలు పెరిగిపోతున్నాయన్నారు. విద్యార్థిని గాయపర్చిన కిరాతకుడిని వెంటనే కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు.

మొక్కజొన్న ఫ్యాక్టరీ ప్రమాదంలో మహిళకు గాయాలు

చింతలపూడి : వెలగలపల్లి మొక్కజొన్న ఫ్యాక్టరీలో ఒక మహిళ ప్రమాదానికి గురైంది. గణిజర్ల గ్రామానికి చెందిన జొన్నలగడ్డ మరియమ్మ మొక్కజొన్న ఫ్యాక్టరీలో పని చేస్తోంది. బహిర్భూమికి బయటికి వస్తున్న సందర్భంగా ఫ్యాక్టరీలోకి రివర్స్‌లో వస్తున్న లారీ ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది. గాయపడిన ఆమెను చింతలపూడి ఆసుపత్రికి తరలించి చికిత్సం అందిస్తున్నారు. కాగా ఆసుపత్రికి తీసుకు వెళ్లడానికి ఫ్యాక్టరీలో అంబులెన్స్ కూడా లేకపోవడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్‌వీ సత్యనారాయణ, మండల అధ్యక్షుడు నత్తా వెంకటేశ్వరరావు ఫ్యాక్టరీ యాజమాన్యం తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళకు అయ్యే వైద్య ఖర్చులు ఫ్యాక్టరీ యాజయాన్యం భరించాలని, మహిళ కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయాలి

చింతలపూడి : వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయాలని ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా పార్టీ యువజన విభాగం అధ్యక్షుడు పడమటి గిరిబాబు గౌడ్‌కు సూచించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే ఎలీజాను గిరిబాబు గౌడ్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తనకు పదవి కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే వీఆర్ ఎలీజాకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలపై యువతకు అవగాహన కల్పించాలని, వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎన్.దుర్గారావు, కె.దినేష్‌రెడ్డి, వెంపాకృష్ణ, బుల్లా దాస్, ప్రకాష్ తదితరులు ఉన్నారు.

గిరిబాబు గౌడ్‌కు అభినందనలు

జంగారెడ్డిగూడెం : ఏలూరు జిల్లా వైఎస్సార్ సీపీ యూత్ అధ్యక్షుడిగా నియమితులైన పడమటి గిరిబాబు గౌడ్‌ను పట్టణంలో వైఎస్సార్‌సీపీ నాయకులు శనివారం ఘనంగా సత్కరించారు. పామర్రు పరిశీలకులు మండవల్లి సోంబాబు, ఉభయగోదావరి జిల్లాల బూత్ రీజనల్ కో–ఆర్డినేటర్ బీవీఆర్ చౌదరి మాట్లాడుతూ గిరిబాబు గౌడ్ ప్రజలతో మమేకమై బీసీల అభ్యున్నతికి, వైఎస్సార్‌సీపీ పురోగతికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ముప్పిడి అంజి, మేడవరపు సాగర్, సంకు సురేష్, ఉగ్గం ప్రసాద్, బత్తిన చిన్న, చిటికెల అచ్యుత రామయ్య, ఎల్‌వీఆర్, సంకు సురేష్, అనిల్‌గౌడ్, పాములపర్తి శ్రీను తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే ఎలీజాకు కృతజ్ఞతలు తెలుపుతున్న గిరిబాబు గౌడ్, పార్టీ శ్రేణులు

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి



రేచర్లలో ఇళ్ల లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపీపీ రాంబాబు నాయక్



బొర్రంపాలెంలో లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

చింతలపూడి : ప్రతి పేదవానికి సొంత ఇల్లు సమకూర్చడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ ధ్యేయమని మండల పరిషత్ అధ్యక్షుడు డా బి.రాంబాబు నాయక్ అన్నారు. రేచర్ల సచివాలయం పరిధిలోని జగనన్న కాలనీని శనివారం ఆయన పరిశీలించారు. ఇళ్ల లబ్ధిదారులతో మాట్లాడారు. లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని సూచించారు. రేచర్ల లేఅవుట్‌లో 66 మందికిగాను 30 మంది లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం ప్రారంభించినట్లు తెలిపారు. మిగిలిన లబ్ధిదారులు కూడా ఇళ్లు నిర్మించుకోవడానికి ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. ఇళ్ల నాణ్యతను లబ్ధిదారులు ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఉండాలని కోరారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

లబ్ధిదారులకు అవగాహన

టి.నరసాపురం : జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణ పనులను లబ్ధిదారులు త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీవో ఎన్‌టీ స్వామి సూచించారు. బొర్రంపాలెం గ్రామంలో జగనన్న లేఅవుట్ కాలనీలో గృహనిర్మాణ లబ్ధిదారులకు శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం జగనన్న కాలనీల్లో అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పిస్తోందన్నారు. ఇప్పటికే మండలంలో పలు కాలనీల్లో మంచినీటి సౌకర్యం కోసం బోర్లు నిర్మించడం, కాలనీల విద్యుదీకరణ పనులను పూర్తిచేశామన్నారు. ఆయా కాలనీల్లో వీధిలైట్ల ఏర్పాటుతో పాటు సీసీ రోడ్ల నిర్మాణం కోసం కృషి చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ జేవీ సుబ్బారావు, గృహనిర్మాణ సంస్థ ఏఈ జి.రాధాకృష్ణ, పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ అధికారిణి సంపత్‌కుమారి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గంగరాజు, ఎలక్ట్రికల్ ఏఈ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వయోపరిమితి పెంపు జీవోపై హర్షం



వందనపు సాయిబాల పద్మను సత్కరిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం : వయోపరిమితితో అగ్రవర్ణ పేదలు అవకాశాలు కోల్పోకూడదనే ఉద్దేశంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చిన జీవో ఎంతో ఉపయోగకరం అని వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు వందనపు సాయిబాల పద్మ అన్నారు. జంగారెడ్డిగూడెంలో ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీల మాదిరిగానే అగ్రవర్ణ పేదల్లో అర్హత ఉన్న ప్రతీ ఒక్కరూ ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకునేలా ఐదేళ్ల వయోపరిమితి పెంచుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జీవో తీసుకురావడం హర్షణీయమన్నారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్యులతో పాటు అగ్రవర్ణ పేదలందరి తరుపున సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

సాయిబాలపద్మకు సన్మానం

వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలిగా వందనపు సాయిబాలపద్మ నియామకంపై పట్టణంలోని వివిధ సంఘాల నాయకులు, ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. శనివారం ఆమెను ఘనంగా సత్కరించారు. జిల్లా మహిళా అధ్యక్షురాలిగా మహిళాభ్యున్నతితో పాటు, పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని కోరుతూ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఛాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు ఉప్పల గంగాధర్, కిరాణా, ఫ్యాన్సీ అసోసియేషన్ నాయకులు, పలువురు పట్టణ ప్రముఖులు ఉన్నారు.

నేటినుంచి జగదాంబ అమ్మవారి ఉత్సవాలు



జగదాంబ అమ్మవారు

బుట్టాయగూడెం (జీలుగుమిల్లి) : మండల కేంద్రమైన జీలుగుమిల్లిలో కొలువై భక్తుల కోర్కెలు తీర్చే తల్లి, వరాలిచ్చే అమ్మగా పేరొందిన జగదాంబ తల్లి అమ్మవారి 66వ వార్షిక ఉత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభంకానున్నాయి. మార్చి 3వ తేదీ వరకు ఈ ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాల నుంచి భక్తులు అమ్మవారిని దర్శించేందుకు తరలివస్తారు. ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం అమ్మవారికి సహస్ర నామార్చన, కుంకుమ పూజలు జరుగుతాయని ఆలయ కమిటీవారు తెలిపారు. జాతర సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని విద్యుత్‌దీపాలతో అలంకరించారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటుచేశారు. 27వ తేదీ రాత్రి సినీఆర్కెస్ట్రా, కూచిపూడి నాట్యప్రదర్శన, 28న సినీమ్యూజికల్ నైట్, మార్చి 1న సినీ మ్యూజికల్ నైట్‌తో పాటు జబర్దస్త్ కళాకారులతో మెగా ఈవెంట్, 2న సినీఆర్కెస్ట్రా, 3న మ్యూజికల్ నైట్ ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

నవ ధాన్యాల సాగుపై అవగాహన పెంచుకోవాలి



చింతలపూడిలో నవ ధాన్యాల సాగుపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం



అచ్చియ్యపాలెంలో నిర్వహిస్తున్న ర్యాలీ

బుట్టాయగూడెం : నవ ధాన్యాల పంటలు పండించడంపై రైతులు అవగాహన పెంచుకోవాలని ప్రకృతి వ్యవసాయ ప్రతినిధి ఎ.వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని అచ్చియ్యపాలెంలో ప్రకృతి వ్యవసాయంలో 30 రకాల చిరుధాన్యాల సాగుపై రైతులకు అవగాహన కలిగించేందుకు శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయానికి ముందు పొలాల్లో నవ ధాన్యాలు వేయాలని సూచించారు. నవధాన్యాల పంట వల్ల దిగుబడి పెరగడమే కాకుండా రైతులకు పెట్టుబడి ఖర్చులు తగ్గుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, సంక్షేమ సహాయకులు, హెల్త్, డిజిటల్ అసిస్టెంట్‌లు తదితరులు పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుపై ర్యాలీ

చింతలపూడి : చింతలపూడి పట్టణంలో నవ ధాన్యాల సాగుపై శనివారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. రైతులు నవ ధాన్యాలు వేయడం వల్ల భూమి సారవంతమవుతుందని ప్రకృతి వ్యవసాయ నిపుణులు పి.హుస్సేన్ తెలిపారు. అంతేకాక సూక్ష్మ జీవులు, వానపాములు పెరుగుతాయని, నీటి నిల్వశాతం పెరుగుతుందని చెప్పారు. ప్రకృతి వ్యవసాయం చేసే రైతులు విత్తనం నాటిన దగ్గర నుంచి సాగులో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం వారు రైతుల నుంచి నేరుగా పంటను కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. శివపురం గ్రామంలో కూడా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎన్ హరిణి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మహా పూర్ణాహుతి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఈ నెల 5న ప్రారంభమైన రామకోటి మహోత్సవాలు శనివారం ముగిశాయి. మూడు వారాల పాటు నగర ప్రజలకు ఆధ్యాత్మిక అనుభవాన్ని అందించాయి. ఉత్సవాల ముగింపు రోజు ఉదయం ప్రత్యేక పూజల అనంతరం విశ్వశాంతి సమాజం సభ్యులు మౌనధ్యానం, భక్తిగీతాలపనలు, హరేరామ సంకీర్తనలు చేశారు. స్వామి వారికి సహస్రనామ పూజలు, నిత్య హోమం, నిత్య కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. మహా పూర్ణాహుతి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం నగరానికి చెందిన సంస్కృత పండితుడు మైలవరపు లక్ష్మీ నరసింహం ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. రాత్రి హరిద్వార్ దాసభారతి ప్రాజెక్టు అసిస్టెంట్ డైరెక్టర్ పరాయతం నారాయణాచార్యులు భాగవతార్ భక్త శబరి అంశంపై నిర్వహించిన హరికథా గానం అలరించింది. స్వామి వారికి పవళింపు సేవ వైభవంగా నిర్వహించారు. తొలుత అర్చకులు దివాకరుని వెంకటేశ్వర్లు, తుమ్మలపల్లి కాశీ విశ్వేశ్వర శర్మ విశేష పూజలు చేయగా, రామకోటి విశ్వశాంతి సమాజం అధ్యక్షుడు జి.రమేష్ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

బీసీలకు ప్రాధాన్యం ఇచ్చేవారికే మద్దతు



బీసీ చైతన్య సంక్షేమ సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులకు నియామక పత్రం అందజేస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం : బీసీల అభ్యున్నతికి పాటుపడి, బీసీల పక్షపాత పార్టీగా పిలవబడే వారికే తాము మద్దతు ఇస్తామని బీసీ చైతన్య సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెలగల దుర్గారావు పేర్కొన్నారు. శనివారం ఆ సంఘం ప్రధాన కార్యదర్శి గాడివర్ల సోమేశ్వరరావు ఆధ్వర్యంలో బీసీ కమ్యూనిటీ హాల్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా జవ్వాది శ్రీనివాస్, కార్యదర్శిగా సురవరపు గోపాలరాజు ఎన్నికయ్యారు. పార్టీలకతీతంగా బీసీల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. సమావేశంలో రాజవరం మాజీ సర్పంచ్ పాముల నాగముని స్వామి,పట్ట పగలు శ్రీనివాస్, తాడి గడప ఆంజనేయరాజు, ముచ్చా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మార్క్‌ఫెడ్ కొనుగోలు కేంద్రం ప్రారంభం

దెందులూరు: దెందులూరు కోఆపరేటివ్ సొసైటీ కార్యాలయంలో శనివారం ఏపీ మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో పెసలు, మినుముల కొనుగోలు కేంద్రం ప్రారంభమైంది. దెందులూరు సమీప గ్రామాల రైతులు సాగు చేసిన పెసలు, మినుములను దెందులూరులోని మార్క్‌ఫెడ్ కేంద్రంలో విక్రయించాలని కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్ కొలుసు గణపతిరావు కోరారు. పెసలు, మినుము సాగురైతులకు నష్టం కలగకుండా వారి సౌకర్యార్థం ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఉన్నతాధికారులతో మాట్లాడి ఏపీ మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసేలా చర్యలు తీసుకున్నారు. ఈ అవకాశాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గన్నవరం అల్లర్లకు టీడీపీదే బాధ్యత

ఏలూరు (టూటౌన్): గన్నవరంలో జరిగిన అల్లర్లకు టీడీపీ బాధ్యత వహించాలని జాతీయ దళిత జేఏసీ చైర్మన్ పెరికె వరప్రసాదరావు కోరారు. షెడ్యూల్డ్ క్యాస్ట్‌కు చెందిన సీఐ పోగిరి కనకారావుపై టీడీపీ నేతలు ఉద్దేశపూర్వకంగా దాడి చేసిన వారిపైనా, టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు, అధికార ప్రతినిధి పట్టాభిలపైనా అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం ప్రవేశ పెడితే దానికి వ్యతిరేకంగా కోర్టులో పిల్ వేసి అడ్డుకున్న వ్యక్తి చంద్రబాబు అని దుయ్యబట్టారు. చంద్రబాబునాయుడు ఎన్ని జిమ్మిక్కులు చేసినా 2024లో వైఎస్ జగన్‌ను తిరిగి సీఎం చేసేందుకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలంతా అండగా ఉంటారని పెరికె పేర్కొన్నారు.

పిల్లలకు ఎంఆర్ వ్యాక్సిన్ డ్రైవ్

గణపవరం: గణపవరం పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో పిల్లలకు పొంగు, తట్టు వ్యాధులు రాకుండా మీజిల్ రూబెల్లా (ఎంఆర్) వ్యాక్సిన్ పంపిణీకి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. మొత్తం పది గ్రామ సచివాలయాల పరిధిలో పిల్లలకు ఈ వ్యాక్సిన్ వేసినట్లు సీహెచ్‌వో విల్సన్‌బాబు తెలిపారు. పీహెచ్‌సీ వద్ద వైద్యాధికారులు సంతోష్, కిరణ్మయి పిల్లలకు వ్యాక్సిన్ వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

కెరీర్ గైడెన్స్‌పై అవగాహన

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక కోటదిబ్బ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు శనివారం కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించారు. రిటైర్డ్ డీఎస్పీ సీహెచ్ సురేంద్ర మోహనరావు ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులకు పలు అంశాలను వివరించారు. సివిల్స్ సాధించడానికి నిరంతరం ప్రణాళికాబద్ధంగా విద్యార్థులు చదవాలని సూచించారు.